క్లుప్తంగా

జాతీయ యోగా పోటీల్లో ప్రతిభ చాటండి



యోగా క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీఓ శ్రీనివాసరావు

కర్నూలు (టౌన్) : ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ ప్రాంతంలో నిర్వహించనున్న 48 వ జాతీయ స్థాయి సీనియర్ యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జాతీయ యోగా సంఘం సభ్యులు న్యాయవాది శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జాతీయ పోటీల్లో పాల్గొంటున్న అక్షర, ఉమేష్‌గౌడ్, రమణమూర్తి, భవానీ, ప్రభావతి, కురువ మునిస్వామిలను అభినందించారు.రాష్ట్ర యోగాసంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి పాల్గొన్నారు.

నేడు 'నాగలి కూడా ఆయుధమే' పుస్తక పరిచయ సభ

కర్నూలు కల్చరల్: ప్రముఖ కవి కొమ్మవరపు విల్సన్ రావు కవితా సంపుటి 'నాగలి కూడా ఆయుధమే' పుస్తక పరిచయ సభ ఆదివారం ఉదయం 10.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్ తెలిపారు. హైదరాబాద్ సిటీ కాలేజీ తెలుగు శాఖాధిపతి ప్రముఖ రచయిత డాక్టర్ కోయికోటేశ్వరరావు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం గ్రహీత తగుళ్ల గోపాల్ అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సాహితీ ప్రియులు, కవులు, రచయితలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక

కర్నూలు (టౌన్): ఈనెల 17 నుంచి దాద్రా నగర్ హవేలిలో నిర్వహించనున్న 52 వ జాతీయ స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రతిభ చాటాలని ఆ క్రీడా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆకాంక్షించారు. రాష్ట్ర జట్టులో శ్రావణి, బ్యూలా శిరీషా, మౌనిక, స్వాతి, దివ్య, కల్యాణి, పూజ, రోజా, షారోన్, సబిత, వర్షిత, సాయి, జట్టు మేనేజర్లుగా ఆయేషా బేగం, కోచ్‌గా జ్యోతి వ్యవహరిస్తారని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

డీఎంహెచ్‌ఓకు అభినందనల వెల్లువ



డీఎంహెచ్‌ఓకు అభినందనలు తెలుపుతున్న ఏపీ హంస అసోసియేషన్ నాయకులు

కర్నూలు (హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్‌కు శనివారం అభినందనలు వెల్లువెత్తాయి. కార్యాలయ ఏఓ అరుణ, సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు, కార్యాలయ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు, వైద్యసిబ్బంది సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రఘురామిరెడ్డి, డాక్టర్ హరీష్ చంద్రారెడ్డి, డాక్టర్ మనోజ్, డాక్టర్ మిథున్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీలేఖ, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, జనరల్ సెక్రటరీ సయ్యద్ షఫి, సిటీ చైర్మన్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రేపు కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: ఎన్.కొంతలపాడు గ్రామంలో సోమవారం అంతర్రాష్ట్ర పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు పగిడ్యాల రాజు తెలిపారు. యాగంటీశ్వరస్వామి తిరునాల సందర్భంగా నిర్వహిస్తున్న పోటీల్లో గెలుపొందిన తొలి ఐదు జట్లకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు అదే రోజు ఉదయం 8 గంటల్లోపు రూ.400 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9502177501, 9849290398 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న కేంద్రం



కర్నూలు(సెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోందని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఆ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో రోజు రోజుకు మీడియాపై దాడులు అధికమవుతున్నాయన్నారు. వాస్తవాలు రాస్తే కొందరు జీర్ణించుకోలేక మీడియా ప్రతినిధులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, నాయకులు గోరంట్లప్ప, జిల్లా కన్వీనర్ నాగేంద్ర పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకే ప్రజలు పట్టం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- కుటుంబసభ్యులతో కలిసి కల్లూరు అర్బన్‌లో ఎన్నికల ప్రచారం



కల్లూరు అర్బన్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకే ఎన్నికల్లో ప్రజలు పట్టం కడతారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల నగారా మోగడంతో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, కుమార్తె మాధవి లత, కుమారుడు కాటసాని శివనరసింహారెడ్డితో కలిసి ఎమ్మెల్యే కల్లూరు అర్బన్ పరిధిలోని 26,27, 34, 47వ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించామన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశామన్నారు. మరింత మేలు జరగాలంటే రానున్న శాసనసభ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. తన రాజకీయ స్వార్థం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు ఆ రెండు పార్టీలతో పొత్తులు పెట్టుకున్నారన్నారు. నమ్మించి మోసం చేయడం బాబు నైజమని, 2019 ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడి మైనార్టీలకు అండగా నిలబడతానని ప్రకటించి తీరా ఆ పార్టీతోనే పొత్తు పెట్టుకున్నారన్నారు. అధికారం కోసం టీడీపీ నాయకులు ఎవరితోనైనా కలుస్తారన్నారు. ఎన్నికల్లో వారికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారంటే కచ్చితంగా నెరవేరుస్తారని ఎమ్మెల్యే సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ అన్నారు. నవరత్నాల పథకాలతో పేదలందరూ బాగుపడ్డారన్నారు. మరింత మేలు జరగాలంటే ఎన్నికల్లో కాటసాని రాంభూపాల్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు ఆయిషా సిద్దిఖా, గాజుల శ్వేతారెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, గంగులు, శ్రీనివాసులు, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పని చేయాలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. పార్టీ పదవులు పొందిన వారందరూ బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సందేపోగు శివను నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసానిని కలిసి శివ ఆయనకు కృతజ్ఞతలు తెలిపాడు. వైఎస్సార్‌సీపీ నాయకులు గోపీనాథ్, సిరాజ్, హుస్సేన్ సాహెబ్, షేక్షావలి, మనోరాజ్, సుభాన్, షకీల్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పాణ్యం నియోజకవర్గంలోని 33 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ ఎఫ్)కింద మంజూరైన రూ. 42,80,000ను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన డుతూ.. పేదల ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.



ఇంటింటి ప్రచారంలో కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ

ఓటేసి ఆశీర్వదించండి

- ఇంటింటి ప్రచారంలో వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్

కర్నూలు (టౌన్): ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్ ప్రజలను విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం 'ఇంటింటికీ ఇంతియాజ్' పేరుతో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి తో కలిసి ప్రతి గడపకెళ్లి ఓటర్లను పలకరించారు. జగనన్న అమలు చేస్తున్న పథకాలు, వాటి వల్ల ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్న జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందామన్నారు. పేదల పక్షపాతిగా నిలిచిన పార్టీలో తాను పనిచేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. చాలా పార్టీలు ఎన్నికలకప్పుడు హామీలు ఇవ్వడం, ఆతరువాత మరచి పోవడం జరుగుతుందన్నారు. అయితే, 2019 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేశారన్నారు. ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడటంతో ప్రతిపక్ష పార్టీలు ఇళ్ల వద్దకు వచ్చి మోసపు మాటలు చెబుతారని, వారిని నమ్మవద్దన్నారు. ఎన్నికల్లో ఓటుతో ఆ పార్టీలను ఓడించాలన్నారు. తనకు ఉన్న పాలనా అనుభవంతో నగరాన్ని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ క్రాంతికుమార్, వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

గ్లకోమాతో శాశ్వత అంధత్వం



కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న వైద్యులు, సిబ్బంది

కర్నూలు (హాస్పిటల్) : గ్లకోమాతో శాశ్వత అంధత్వం వచ్చే అవకాశముందని సుశీల నేత్రాలయ అధినేత డాక్టర్ పి.సుధాకర్ రావు చెప్పారు. గ్లుకోమా వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. రాజ్‌విహార్ నుంచి ప్రారంభమై కలెక్టరేట్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ పి.సుధాకర్ రావు మాట్లాడుతూ బీపీ, షుగర్, దీర్ఘకాలిక జబ్బుల నియంత్రణలో లేకపోతే గ్లకోమా వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఈ జబ్బులున్నవారు ప్రతి ఆరు నెలలకోసారి కంటి పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. 40 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్లకోమా లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ సావిత్రి, కంటి వైద్యులు డాక్టర్ నేహా సుధాకర్, డాక్టర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో చలివేంద్రాలు ఏర్పాటు



చలివేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శ్రీ సద్గురు దత్త కృపాలయం ఆధ్వర్యంలో మూడు చలివేంద్రాలు ఏర్పాటయ్యాయి. శనివారం ఆసుపత్రిలోని సూపర్‌స్పెషాలిటీ బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ప్రారంభించారు. ఆసుపత్రిలో శ్రీ సద్గురు దత్త కృపాలయం వారు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం వెయ్యి మంది వరకు రోగుల సహాయకులకు భోజనం అందిస్తున్నారని తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీ సద్గురు దత్త కృపాలయం ప్రెసిడెంట్ మల్లారెడ్డి, సెక్రటరి శ్రీధర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వాసవి ఏజెన్సీస్ ఆధ్వర్యంలో...

నగరంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో శ్రీ వాసవి ఏజెన్సీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పారిశ్రామిక వేత్త టీజీ భరత్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏజెన్సీస్ అధినేత వి.శేషఫణి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కర్నూలు కల్చరల్: విజ్ఞాన సేవా సమితి, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వివేకానంద స్టడీ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పుల్లారెడ్డి కళాశాల వద్ద మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, జీపీఆర్‌ఈసీ మెకానికల్ అసోసియేట్ ప్రొఫెసర్ నాగఫణి శాస్త్రి దీనిని ప్రారంభించారు.

దళిత ఉద్యోగులకు అండగా 'మేడ్'

- రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్



దేవపాల్‌ను సన్మానిస్తున్న మేడ్ నేతలు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళిత ఉద్యోగులకు మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్ (మేడ్) అండగా నిలుస్తోందని మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ అన్నారు. శనివారం స్థానిక కాంకర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మేడ్ జిల్లా అధ్యక్షురాలు బెన్నమ్మ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి, పీఆర్ రిటైర్డు ఎస్ఈ సురేంద్రనాథ్, సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారి కె. బాబు హాజరయ్యారు. దేవపాల్ మాట్లాడుతూ మేడ్ దళితుల పక్షపాతిగా ఉంటూ అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తోందన్నారు. ఉపాధ్యక్షుడు కె. బాబు, జిల్లా అధ్యక్షురాలు బెన్నమ్మ మాట్లాడుతూ దళిత ఉద్యోగులకు మేడ్ అనేక రూపాల్లో సేవలు అందిస్తోందన్నారు. జిల్లాలో కూడా మేడ్‌ను విస్తృత పరిచేందుకు చర్యలు చేపడతామన్నారు. రాష్ట్ర అధ్యక్షులు దేవపాల్‌ను నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు నారాయణ, రజనీ పాల్గొన్నారు. అంతకు ముందుమేడ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బెన్నమ్మ, ప్రధాన కార్యదర్శిగా విజయభాస్కర్, కోశాధికారిగా ప్రత్యూషను ఎన్నుకున్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్ఆర్‌సీపీ నేతలు ఇంతియాజ్, బీవై రామయ్య



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు (టౌన్): పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ అని వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్ అన్నారు. శనివారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని స్థానిక చిల్డ్రన్స్ పార్కు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు పొట్టి శ్రీరాములు పోరాటం ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కర్నూలు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్ మద్దయ్య, కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి నివాళి

కర్నూలు(సెంట్రల్): అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతిని పురస్కరించుకుని ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఉండవెల్లి వెంకటన్న, రామస్వామి, రామాంజనేయులు, వెంకటరెడ్డి, బతుకన్న మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఆ మహనీయుడి అడుగుజాడల్లో నడవాలని కోరారు.

కేసీలో గుర్తు తెలియని మృతదేహం

కర్నూలు (టౌన్) : కేవీఆర్ కళాశాల వద్ద కేసీ కెనాల్‌లో గుర్తు తెలియని శవం కనిపించింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి 30 ఏళ్ల వయస్సు ఉంటుందని రెండోపట్టణ పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు వెల్లడించారు.

ఏడుగురిపై చీటింగ్ కేసు నమోదు

కర్నూలు (టౌన్) : 67 సెంట్ల స్థలాన్ని అభివృద్ధి చేసి ఇస్తానని చెప్పి మోసం చేయడమే కాకుండా రూ.2 కోట్లు డిమాండ్ చేసిన ఏడుగురిపై రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. స్కందాన్షి ఇన్‌ఫ్రా ప్రాజెక్టుకు చెందిన స్థలాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించిన జి.శ్రీనివాసులు, జి.వెంకటేశ్వర్లుతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

కర్నూలు(సిటీ): క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలను చేరుకోగలరని రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య అన్నారు. స్థానిక గణేష్ నగర్‌లోని హొరిజన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ వార్షికోత్సవం శనివారం టీజీవీ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ ప్రదీప్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జి.పుల్లయ్యతో పాటు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, విశ్వభారతి హాస్పిటల్ చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రావ్యారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జి.పుల్లయ్య మాట్లాడుతూ అంతరించి పోతున్న మానవ విలువలను కాపాడవలసిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ పీబీవీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు 81 క్యూసెక్కుల నీరు

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శనివారం 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.078 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ ఆదర్శ పాఠశాలలో ఆరో తగరతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ దిల్షాద్ తెలిపారు. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా https:// apms. apcfss. in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పాఠశాలలోనే తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు ప్రవేశ పరీక్ష కోసం రూ. 150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75 చెల్లించాలన్నారు. మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

కల్లూరు: మండలంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలను శనివారం ఎంఈఓ-1 శ్రీనివాసులు పరిశీలించారు. కల్లూరు మండలంలో మొత్తం 18 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తునట్లు తెలిపారు. విద్యార్థులకు మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

గ్రూపు–1 పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశం

కర్నూలు(సెంట్రల్): నేడు జరిగే గ్రూపు-1 ప్రిలిమ్స్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. గ్రూపు-1 పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆయన ఆదేశించారు. ఎండలు తీవ్రతరం కానున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూధన్‌రావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు మండలాధికారులు చర్యలు తీసుకోవాలనిక లెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓలు, తహసీల్దార్లతో ఎన్నికల కోడ్ అమలుపై సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవతేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు ఎం.శేషిరెడ్డి, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బంది తలెత్తకూడదు



ఇందిరాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పోలింగ్ స్టేషన్ల ఎంపిక జరగాలని 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శనివారం స్థానిక నగరంలోని 5 మోడల్ పోలింగ్ స్టేషన్లను అధికారులతో కలిసి పరిశీలించారు. కల్పించిన సదుపాయాల గురించి సంబంధిత ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్లు రవిప్రకాష్ నాయుడు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయండి

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే 08518-249766 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం



ఎమ్మిగనూరు పీఎస్ పరిధిలో పోలీసు కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

కర్నూలు (టౌన్) : ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే తమ లక్ష్యమని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే పోలీసుల కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అలాగే పోలీసులకు జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు. జిల్లాలోని కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్లలోని ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలైన సశస్త్ర సీమాబుల్ సిబ్బందితో పోలీసు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. కోడుమూరు సర్కిల్, గూడూరు పీఎస్ పరిధిలోని చనుగొండ్ల, గూడూరు, గుడిపాడు, అలాగే ఆలూరు సర్కిల్, ఆలూరు పీఎస్ పరిధిలోని మొలగవల్లి, హత్తిబెళగల్, అగ్రహారం, అరికెర, ఆలూరు, పెద్దహొతూరు, ఎమ్మిగనూరు రూరల్ పీఎస్ పరిధిలోని కందనాతి, కడివెళ్ల గ్రామాల్లో పోలీసుల కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

గాయత్రి ఆసుపత్రిపై కేసు నమోదు

కర్నూలు (టౌన్): స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని గాయత్రి ఆసుపత్రి యాజమాన్యంపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరోగ్యశ్రీ నిధులు దుర్వినియోగం చేసినట్లు సమాచారం రావడంతో ఆ విభాగం అధికారులు గాయత్రి ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించారు. రూ.5.28 కోట్ల వరకు నిధుల దుర్వినియోగం జరిగినట్లు ప్రాథమికంగా తేలడంతో శనివారం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా నిధుల దుర్వినియోగంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గజవాహనంపై ఊరేగిన శ్రీరంగనాథుడు



గజవాహన సేవలో జీయర్ స్వాములు, భక్తులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో శ్రీ గోదా దేవి సమేత రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజు శనివారం స్వామివారికి గజవాహన సేవ నిర్వహించారు. తిరుమాడ వీధుల్లో స్వామివారు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీమన్నారాయణాచార్య స్వామి యాజ్ఞికత్వంలో అర్చకులు రమేష్ భట్టర్, కిరణ్ భట్టర్ బృందం వైదిక క్రతవు నిర్వహించారు. గజం ఐశ్వర్యానికి, వైభవానికి సంకేతంగా భావిస్తారని పీఠాధిపతులు అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామి, ప్రయాగ్ రాజ్ రాఘవ ప్రసన్న జీయర్ స్వామి, పరమాత్మ నందగిరి స్వామి, గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాల సుధాకర్, భూమా కృష్ణమోహన్, వేముల జనార్దన్, తల్లం సురేష్, తలుపుల శ్రీనాథ్, వెంకట సుబ్రహ్మణ్యంతో పాటు గోదాగోకులం పరివారం పాల్గొన్నారు.